క్లుప్తంగా

ఎమ్మెల్సీకి సన్మానం


పుష్పగుచ్ఛం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎమ్మెల్సీ మల్లన్న ఆదివారం కొండపోచమ్మ రోడ్డు గుండా కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వెళ్తున్నారు. మార్గంలో జగదేవ్‌పూర్ మండల యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, తిగుల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, నాయకులు వెంకట్రామిరెడ్డి, లోకేష్, మహేందర్‌రెడ్డి, మనోజ్, కరుణాకర్ ఆయనకు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు.

హెల్ప్‌లైన్ ఏర్పాటు

హుస్నాబాద్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. వర్షాల కారణంగా ఏదైన సమస్య తలెత్తితే వెంటనే 73373 47610 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ చైర్మన్ మంజుల


మంజుల

సిద్దిపేటజోన్: వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ మంజుల అన్నారు. ఆదివారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వార్డుల్లో పురాతన, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మ్యాన్ హోల్స్‌పై సంబంధిత అధికారులు దృష్టిసారించాలన్నారు. సమస్యలు తెలియజేసేందుకు 95055 07248 హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు.

ఎడతెరిపిలేని వర్షంతో..

దుబ్బాక: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కారణంగా పనులు లేక దినసరి కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. పురాతన ఇళ్లు కూలిపోయే ప్రమాదముందంటూ యజమానులు ఆందోళన చెందుతున్నారు. పలుకాలనీల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు వస్తోందని చెబుతున్నారు. దుంపలపల్లి రోడ్డులోని షాదీఖానా చుట్టు వరద నీరు చేరింది.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

తొగుట(దుబ్బాక): మండలంలో మూడు రోజులుగా వర్షం కురుస్తోంది. దీంతో మండలంలోని తుక్కాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. సిద్దిపేట–గజ్వేల్ పట్టణాల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గమనించిన స్థానికులు తొగుట పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడకు చేరుకొని జేసీబీ సహాయంతో చెట్టును తొలగించారు.

వ్యవసాయం తెలియని వారికి పదవులొద్దు

చేర్యాల(సిద్దిపేట): వ్యవసాయం తెలియని వారికి మార్కెట్ చైర్మన్ పదవి ఇవ్వడం సరి కాదని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు కొంగరి వెంకట్‌మావో, రాళ్లబండి నాగరాజు అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో వారు మాట్లాడుతూ చేర్యాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవిని వ్యవసాయమంటే తెలియని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, హైదరాబాద్ వాస్తవ్యుడు నల్లనాగుల శ్వేతకి ఇవ్వడం ఈ ప్రాంత ప్రజలకి ద్రోహం చేసినట్లేనన్నారు. నామినేటెడ్ పదవుల కేటాయింపు విషయంలో స్థానిక అధికార పార్టీ నాయకుడు అనుసరిస్తున్న విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రభాకర్, మల్లేశం, రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఆదివారం వాకర్స్‌తో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మాట్లాడారు. వాకర్స్ సమస్యలు తన దృష్టికి తేవాలని సూచించారు. సీసీ కెమెరాలు, తాగునీరు, బాత్‌రూం సమస్యలు ఉన్నాయని తెలపడంతో, వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పూజల గోపికృష్ణ, కలీమొద్దీన్, చిన్నప్ప, సాంబమూర్తి, రాజిరెడ్డి, మహేందర్, వంశీ, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పండుగలు సంస్కృతికి ప్రతిబింబాలు

పండుగలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దీకొండ మైసమ్మ ఆలయంలో నిర్వహించిన అమ్మవారి బోనాల ఉత్సవానికి హాజరయ్యారు.

నిబంధనలు గాలికి..

- వసతులు లేని పెట్రోల్ బంకులు
- నిరుపయోగంగా గాలినింపే యంత్రాలు
- కనిపించని ఫస్ట్ ఎయిడ్, ఫిర్యాదు బాక్స్‌లు
- అందుబాటులోలేని మరుగుదొడ్లు
- పట్టించుకోని అధికారులు


అక్కన్నపేటలోని భారత్ పెట్రోల్ బంక్

పెట్రోల్ బంకుల నిర్వాహకులు నిబంధనలు పాటించడంలేదు. సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బంకుల్లో కనీస సౌకర్యాలు, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంకులను పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు వాటిపై కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


పనిచేయని గాలినింపే యంత్రం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో మొత్తం ఐదు పెట్రోల్ బంకులున్నాయి. వీటిలో అక్కన్నపేట మండల కేంద్రంలో భారత్ పెట్రోల్ బంక్, గొల్లకుంట గ్రామ శివారులో ఇండియన్ ఆయిల్, అంతక్కపేట గ్రామంలో భారత్ పెట్రోల్ బంక్, గౌరవెల్లి గ్రామంలో హెచ్‌పీ, రామవరం గ్రామంలో ఇండియన్ ఆయిల్ బంకులు ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ నాణ్యతపై అనుమానాలను నివృత్తి చేసే ఉపకరణాలు అందుబాటులో లేవు. నాణ్యత నిర్ధారణకు నిర్వహించాల్సిన డెన్సిటీ పరీక్షలకు అవసరమైన ఫిల్టర్ పేపర్ అందుబాటులో ఉంచడంలేదు. నాణ్యతపై అనుమానాలు ఉంటే స్థానిక రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఇందుకు అధికారుల వివరాలు, ఫోన్ నంబర్లు బోర్డులో వినియోగదారులకు కనిపించే విధంగా ఉంచాలి. అగ్ని ప్రమాద నివారణ పరికరాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. ఇసుక బకెట్లను ఏర్పాటు చేయడంలేదు. ఆయిల్ కార్పొరేషన్ నిబంధనల మేరకు ప్రతీ పెట్రోల్ బంకులో వాహనాలకు ఉచితంగా గాలినింపే యంత్రాలు ఉంచాలి. మండలంలోని భారత్ పెట్రోల్ బంక్‌లో గాలినింపే యంత్రాలు పని చేయడంలేదు. అదేవిధంగా గొల్లకుంట, రామవరం, గౌరవెల్లి గ్రామాల్లో ఉన్న పెట్రోల్ బంకుల్లో గాలినింపే యంత్రాలు ఏర్పాటు చేయలేదు. అదేవిధంగా తాగునీరు, అత్యవసరంగా కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు, సేద దీరడానికి గదులు ఏర్పాటు చేయాలన్న నిబంధనలు ఉన్నా ఎవరూ పాటించడంలేదు. సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఫిర్యాదు పెట్టె ఏదీ?

ప్రతీ బంకులో ఫిర్యాదుల పెట్టే లేదా రిజిస్టర్ అందుబాటులో ఉంచాలి. ఇందులో వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. అక్కన్నపేట మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్‌లో ఫిర్యాదుల పెట్టె కనిపించడం లేదు.

గాలినింపే యంత్రం పనిచేయడంలేదు



పెట్రోల్ బంకుల్లో వాహనాలకు ఉచితంగా గాలి నింపాలి. కానీ, స్థానిక భారత్ పెట్రోల్ బంక్‌లో గాలి నింపే యంత్రం పనిచేయడం లేదు. మరుగుదొడ్ల గదులకు తాళాలు వేసి ఉంచుతున్నారు. ఫిర్యాదు పెట్టే కనిపించడంలేదు. సేద తీరేందుకు అనువైన గదిని ఏర్పాటు చేయలేదు.

– అర్జున్ నాయక్, చౌడుతండా

బంకులో తనిఖీలు చేయాలి



మండలంలోని పలు పెట్రోల్ బంకుల్లో అందేసేవలపై సంబంధిత అధికారులు దృష్టిసారించడం లేదు. తనిఖీలు కూడా చేయడం లేదు. భారత్, ఇండియన్ బంకులకు పైకప్పులు కూడా లేవు. పెట్రోల్ పోయించుకోవడానికి వస్తే ఎండలో ఎండాలి, వానలో తడవాల్సిందే. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేపడతాం.

– గుగులోతు రాజునాయక్, చౌడుతండా

ఆరుతడి పంటలకు జీవం

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఆరుతడి పంటలకు లాభం చేకూరింది. రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. దీంతో మెట్ట పంటలకు ప్రాణం వచ్చింది. ఇటీవల కురిసిన మోస్తరు వర్షానికి పత్తి పంటను విస్తారంగా సాగు చేశారు. అయితే, ఇప్పటి వరకు సరైన వర్షం కురవకపోవడంతో పలుచోట్ల పత్తి, మొక్కజొన్న పంటలు ఎండుముఖం పట్టాయి. వేలాది రూపాయలు అప్పుచేసి సాగు చేస్తున్న పంటలు కళ్లముందే ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మరో వారం వర్షాలు లేకుంటే పంటలపై ఆశ వదులుకోవాల్సిన పరిస్థితి. ఈ తరుణంలో రెండు రోజులుగా వర్షం పడుతుండటంతో ఎండుతున్న పంటలకు ఊపిరి పోసినట్లయింది. విత్తనాలు వేయని రైతులు విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. శనివారం నుంచి వర్షం పడుతుండటంతో పొలాల్లోని నీళ్లు చేరాయి. కొన్ని పొలాల్లో నీళ్లు నిలిచి ఉండటంతో మొలక దశలో ఉన్న పంటలు దెబ్బ తింటాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.


వింజపల్లి శివారు పత్తి చేలో నిలిచిన నీరు

పత్తి పంటకు ..

జగదేవ్‌పూర్(గజ్వేల్): మూడు రోజులుగా కురుస్తున్న వర్షం పత్తి పంటకు జీవం పోసింది. రోహిణీ కార్తెలో కురిసిన వర్షాలకు రైతులు పత్తి విత్తనాలు నాటారు. జిల్లాలో మూడు లక్షలకు పైగా పత్తి సాగు చేపట్టగా, మండలంలో 12 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. 45 రోజులుగా వర్షాలు లేకపోవడంతో పత్తి పంట ఎండుముఖం పట్టిందని, కురుస్తున్న వర్షాలు పంటకు జీవం పోసిందని రైతులు చెబుతున్నారు. అలాగే వరి సాగుకు మేలు చేస్తుందన్నారు.


తిగుల్ గ్రామంలో పత్తి పంట

సౌదీలో బేగంపేట వాసి మృతి


రవి(ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన రాగి రవి (55) అనారోగ్యంతో ఈనెల 13వ తేదీన సౌదీలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉపాధి కోసం 16 ఏళ్ల క్రితం సౌదీ వెళ్లాడు. ఏడాదిన్నర క్రితం స్వగ్రామానికి వచ్చి మళ్లీ వెళ్లాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం జరిగింది. అద్దె ఇంట్లో చిన్న కుమార్తె, కుమారుడు నివాసముంటున్నారు. కుమారుడు శ్రీకాంత్ గ్రామంలో హమాలీ పని చేస్తున్నాడు. రవి మృతదేహాన్ని స్వగ్రామానికి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నడనడకన అభివృద్ధి పనులు


నందారం ప్రాథమిక పాఠశాలలో తీసిన గుంత

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు ×అమ్మ ఆదర్శ కమిటీలు× చేపట్టాయి. బాలికలకు మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, తాగునీటి వసతి, చిన్నపాటి మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం తదితర పనులు చేస్తున్నాయి. కాగా మండలంలోని నందారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. పాఠశాలలు ప్రారంభం కాకముందే పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మరుగుదొడ్లు, సంపు నిర్మాణానికి పాఠశాలలో గుంతలను తీశారు. పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కార్తీక

ఘనంగా మహంకాళి బోనాలు

దుబ్బాక రూరల్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవం నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కోహెడ(హుస్నాబాద్): ఉచిత టైలరింగ్ శిక్షణను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం తిరుపతిగౌడ్ అన్నారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సిద్దిపేట ఆధ్వర్యంలో టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి ఆరు రోజులు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల మహిళలు స్థానిక రైతు వేదికలో తమ ఆధార్, రేషన్ కార్డు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు ఇవ్వాలని సూచించారు.

◆ సేవాగుణం అలవర్చుకోవాలి

మర్కూక్(గజ్వేల్): ప్రతీ ఒకరూ సేవా గుణాన్ని అలవరుచుకోవాలని గజ్వేల్ సెంట్రల్ రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడు తుమ్మ కృష్ణ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తనపై నమ్మకంతో రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలన్నారు. సంపాదనలో కొంతభాగం సామాజిక కార్యక్రమాలకు ఖర్చు చేయాలని సూచించారు.

◆ ప్లేస్కూల్ ప్రతిపాదన విరమించుకోవాలి

గజ్వేల్: అంగన్‌వాడీ కేంద్రాలను ప్లే స్కూళ్లుగా మార్చే ప్రతిపాదనను విరమించుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిపాదనతో పిల్లలు అంగన్‌వాడీ కేంద్రంలోనే మూడో తరగతి వరకు చదువుకోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతోందని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్లేస్కూళ్లుగా మార్చి ఒక టీచర్‌తోనే మూడు తరగతులను కొనసాగించి, ఆ తర్వాత నాలుగో తరగతి నుంచి ఇంటర్ వరకు సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెబుతోందని, దీంతో విద్యావ్యవస్థ నిర్వీర్యం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్(ఐసీడీఎస్) పథకం కింద స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయని, వాటిని ప్లే స్కూళ్లుగా మార్చి విద్యాశాఖ కిందకు ఎలా తెస్తారో స్పష్టత రావాల్సి ఉందన్నారు.

◆ 25న ఇసుక వేలం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన రైతు మచ్చ రంగారెడ్డి పొలంలో నిల్వ చేసిన ఇసుకను ఈనెల 25వ తేదీన వేలం వేయనున్నట్లు తహసీల్దార్ అనంతరెడ్డి ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొన వచ్చన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు ముందుగా 20 శాతం డబ్బులు చెల్లించి పాల్గొనాలన్నారు.


శ్రీనివాస్ నగర్‌లో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కదిలిన యంత్రాంగం

- ఫిర్యాదులపై స్పందించిన అధికారులు
- యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించిన వైనం
- సాక్షికి అభినందనల వెల్లువ

సాక్షి ఎఫెక్ట్..

సిద్దిపేటజోన్: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య మీడియా వారధిగా ఉంటుందని సాక్షి నిజం చేసింది. సిద్దిపేట ప్రజల సమస్యలను అధికారులకు నేరుగా తెలిపే ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని శనివారం చేపట్టిన విషయం పాఠకులకు తెలిసిందే. 24 గంటల్లో అధికార యంత్రాంగం ప్రజల ఫిర్యాదులను పరిశీలించారు. సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి రెవెన్యూ, పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సతీష్, వనిత సమస్యలున్న ప్రాంతాలకు వెళ్లి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. చెత్త సేకరణ వాహనాలు రావడం లేదన్న ఫిర్యాదు మేరకు అధికారులు ఆయా వార్డులకు వెళ్లి పారిశుద్ధ్య పనుల తీరును పరిశీలించారు. 38 వార్డులోని ప్రియదర్శిని నగర్‌లో ఇంటి నంబర్ కేటాయింపు ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు ఫిర్యాదుదారు ఇంటికి వెళ్లి పత్రాలు పరిశీలించి ఇంటి నంబర్ కేటాయింపు ప్రొసీడింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫోన్ ఇన్ కార్యక్రమం చేపట్టినందుకు పట్టణ ప్రజలు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.


చెత్త సేకరణ తీరును పరిశీలిస్తున్న అధికారి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


రామునిపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2010- 11 బ్యాచ్ విద్యార్థులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2010- 11లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 13 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించారు. రోజంతా ఆటపాటలతో సందడి చేశారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలోని గీతాశ్రమ పాఠశాలలో 2001–02లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం బెజ్జంకి లయన్ భవన్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు మోహన్‌ను సత్కరించారు.

విజ్ఞానంవైపు నడిపించేది గురువులే. .

- మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

హుస్నాబాద్: అజ్ఞానం నుంచి విజ్ఞానం వైపు నడిపించే శక్తి కేవలం గురువుకే ఉంటుందని ఆదివారం మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఎల్లప్పుడు స్మరించుకోవాలన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ధర్మవీర్ యోగ శిక్షణ గురువు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌ను శిష్యులు ఘనంగా సన్మానించారు.


హుస్నాబాద్‌లో అనితను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, యోగా సాధకులు

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): గురుపౌర్ణమి సందర్భంగా బెజ్జంకిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

విద్యాసరస్వతి క్షేత్రంలో ..

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ వేదపండితులు, అర్చక పరివారం అమ్మవారి సన్నిధిలో విశేష పూజలు చేశారు. వ్యాస భగవానుడు, ఆదిశంకరాచార్యులను స్మరించుకుంటూ సప్తశతి పారాయణాది పూజలు, అనంతరం గురువందనం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపాఠశాల గురువులు జ్యోతి హరీశ్ శర్మ, పెనుమర్తి సుధీర్, అభిరాం ఆచార్యలను ఆలయ కమిటీ ప్రతినిధులు, వేదవిద్యార్థులు ఘనంగా సన్మానించారు.

మర్పడ్గలో..

కొండపాక(గజ్వేల్): మంచిని ఆచరిస్తూ ధర్మబద్ధమైన జీవనం సాగించడమే అసలైన గురుదక్షిణ అని దేవీ ఉపాసకుడు చెప్పెల హరినాథ శర్మ అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి.

గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్: గురుపౌర్ణమి వేడుకలు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతోపాటు మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. హౌసింగ్ బోర్డు, లక్ష్మీ ప్రసన్న కాలనీ షిరిడి సాయిబాబా ఆలయం, పిడిచేడు సత్యసాయి దేవాలయం, బుర్గుపల్లి సత్యసాయి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని షిరిడీ సాయి దేవాలయంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.


లింగాయపల్లి తండాలో ఎద్దు కళేబరం


గొడుగుపల్లిలో రోదిస్తున్న సుధాకర్

పిడుగుపడి రెండు ఎద్దుల మృత్యువాత

దుబ్బాకటౌన్: పిడుగు పాటుకు రెండు ఎద్దులు మృతి చెందాయి. ఈ ఘటనలు దౌల్తాబాద్ పరిధిలోని గొడుగుపల్లి, లింగాయపల్లి తండాలో శనివారం అర్ధరాత్రి జరిగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని లింగాయ పల్లి తండాకు చెందిన గంగులోత్ పీర్యా తమ ఎద్దును పొలం వద్ద పాకలో శనివారం కట్టేశాడు. పాకపై అర్ధరాత్రి పిడుగు పడింది. ఆదివారం పీర్యా వెళ్లి చూడగా విగత జీవిగా కనిపించింది. దాని విలువ రూ. 70 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు. అలాగే గొడుగుపల్లి గ్రామానికి చెందిన మద్దెల సుధాకర్ రోజు మాదిరిగానే ఎడ్లను మైదానంలో కట్టేశాడు. ఆదివారం ఉదయం వచ్చి చూడగా ఎద్దు మృతి చెంది కనిపించింది. ఎద్దుమృతిపై అనుమానం వ్యక్తం చేశాడు. తనకు రూ.60 వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

విద్యుదాఘాతంతో మరొకటి

చేర్యాల(సిద్దిపేట): విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన ఘటన ఆదివారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన రైతు బీర్ల రమేశ్ కాడెద్దు పొలం గట్టుపై గడ్డిమేస్తూ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఎద్దు విలువ రూ.70 వేలు ఉంటుందిని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.


చేర్యాలలో..